క్లుప్తంగా

పైపులైను లీకేజీని అరికట్టరా..?



పుదిపట్లలో లీకేజీ అవుతున్న నీరు

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల గ్రామానికి తాగునీరు సరఫరా చేసే పైపులైను దెబ్బతినింది. పైపులైను లీకేజీ కారణంగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వద్ద నీరు నిలిచి అధ్వానంగా వుంది. దోమలకు నిలయంగా మారింది. తాగునీటి కలుషితం అవుతోందని, టైఫాయిడ్ తదితర అంటువ్యాధులు ప్రబలకముందే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈవో నటరాజన్

సదుం: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంఈవో డాక్టర్ నటరాజన్ తెలిపారు. మండలంలోని గాండ్లపల్లె కురవపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏబీసీ వలంటరీ ఆర్గనైజేషన్ ప్రతినిధి సుమలత(యూఎస్) అందించిన విద్యాసామగ్రిని ఎంఈవో అందజేశారు. కొన్నేళ్లుగా విద్యాసామగ్రిని అందజేస్తున్న దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీచర్ కిశోర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుఖీభవ రానివారు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి



మెగా చెక్కు అందజేస్తున్న జేసీ విద్యాధరి, అధికారులు

పలమనేరు: సాంకేతిక కారణాలతో అన్నదాత సుఖీభవ నిధులు జమకాని వారు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వ్యవసాయ కార్యాలయంలో సమర్పించి అప్‌డేట్ చేసుకోవాలని జేసీ విద్యాధరి తెలిపారు. మండలంలోని పెంగరగుంట సచివాలయం వద్ద శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె అధికారులు, నాయకులతో కలిసి మెగా చెక్కు అందజేశారు. ఏటా కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు కలిపి రూ.20 వేలను మూడు దఫాలుగా రైతుల ఖాతాల్లోకి జమచేయనున్నట్టు తెలిపారు. పలమనేరు నియోజకవర్గంలో 3,83,368 మంది రైతులకు తొలివిడతగా రూ.25.83 కోట్లను జమచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో భవాని, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, ఏడీ సావిత్రి, పలు మండలాల ఏవోలు, పీఏసీఎస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నేతలు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని శివాడి గ్రామ సేవా సమితి అధ్యక్షుడు రామమూర్తి, కార్యదర్శి ధనుంజయ తెలిపారు. కుప్పం పీఈఎస్ హాస్పిటల్ వైద్యులు సుమారు 255 మందికి వైద్య పరీక్షలు చేశారని తెలిపారు. 15 మందిని కంటి, 10 మందిని ఆర్థో, ఇద్దరు వినికిడి, ఐదుగురు గుండె సంబంధిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు వెల్లడించారు. సర్పంచ్ హరినాథ్, పీఈఎస్ పీఆర్వోలు వెంకటేష్, చంద్ర పాల్గొన్నారు.

ఎస్పీ నిరంకుశ వైఖరి విడనాడాలి

వి.కోట: మదనపల్లి రూరల్ మండలం బుద్దుని కొండపై బుద్ధుడి విగ్రహ ధ్వంసం ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయలేదని, ఎస్పీ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని వీసీకే, బీఎస్పీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు ఆరోపించారు. వారు శనివారం వి.కోటలో విలేకరులతో మాట్లాడారు. చిన్నపిల్లలు ఆడుకుంటుండగా బుద్ధుడి విగ్రహం తల పగిలిపోయిందని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారని పేర్కొన్నారు. అందులో ఇద్దరు ముస్లిం మైనర్ బాలురు వున్నారని, వారిలో ఒకరికి మతిస్థిమితం లేదని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరిన తమపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేయడం దారుణమన్నారు. బౌద్ధులపై 10కి పైగా తప్పుడు కేసులు బనాయించారని, ఈ నెల 9న నిర్వహించనున్న ధర్మ ర్యాలీకి అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరపించారు. దీనిపై ప్రభుత్వం స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొరస్వామి, శ్రీనివాసులు, శివరాం, వినోద్‌కుమార్, మోహన్, తంగరాజ్, సురేష్, రాజగోపాల్, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తోలుతూనే ఉంటాం..

దమ్ముంటే పట్టుకోండి!





జమ్మొడ్డు చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్న హిటాచీ, మట్టి రవాణా చేస్తున్న టిప్పర్లు

‘అధికారం మాది. మమ్మల్ని అడ్డుకునేవారు ఎవరు. చెరువుల నుంచి మట్టిని తోలుతూనే ఉంటాం, దమ్ముంటే ఆపండి’ అని గంగవరం మండలానికి చెందిన పచ్చ మట్టి మాఫియా సవాల్ విసురుతోంది. రేయింబవళ్లు తేడా లేకుండా జేసీబీలతో చెరువుల్లో తవ్వకాలు చేసి రియల్ ఎస్టేట్ వెంచర్లు, లేఅవుట్లకు తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. భారీ వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు వస్తే ప్రమాదం తప్పదని, భూగర్భ జలాలు అడుగంటే అవకాశం వుందని రైతులు వాపోతున్నారు. చెరువులను నాశనం చేస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారులు మాకెందుకులే అనుకుంటున్నారు. చెడ్డపేరు వస్తున్నా స్థానిక ఎమ్మెల్యే అక్రమార్కులను ఎందుకు వారించడం లేదని టీడీపీ నేతలే విమర్శిస్తున్నారు.

- గంగవరంలో రెచ్చిపోతున్న పచ్చమట్టి మాఫియా
- చెరువుల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- టిప్పర్ రూ.7 వేలు, ట్రాక్టర్ రూ.3 వేలు
- యథేచ్ఛగా లేఅవుట్లకు తరలిస్తూ రూ.లక్షలు ఆర్జన
- అక్రమాలపై చెడ్డ పేరొస్తున్నా పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే

గంగవరం/పలమనేరు : గంగవరం మండలం కొత్తపల్లికి చెందిన టీడీపీ నాయకుడు పలు చెరువుల్లో రాత్రీ పగలు తేడా లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. గతంలో కొత్తపల్లి గ్రామం సమీపంలోని పాలమాకుల(పెద్ద) చెరువు, తర్వాత కీలపట్ల, గంగవరం, మేలుమాయి గ్రామాల సమీపాల్లోని చెరువుల్లో మట్టిని తవ్వేశారు. తాజాగా పలమనేరు -మదనపల్లి హైవేలోని మబ్బువారిపేట గ్రామ సమీపం వద్ద జమ్మొడ్డు చెరువులో జేసీబీలతో దాదాపు నెల రోజులకు పైగా మట్టి తవ్వకాలు జరుపుతున్నాడు. ఈ చెరువు దాదాపు 56 ఎకరాల్లో విస్తరించి వుంది. ఇప్పటికే వేలాది లోడ్ల మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రియల్ ఎస్టేట్ వెంచర్లు, లేఅవుట్లకు తరలించేశారు. ఇంకా తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. ఇతని ధనదాహానికి ఇంకెన్ని చెరువులు నాశనమవుతాయోనని జనం భయపడుతున్నారు.

రోజుకు లక్షల్లో సంపాదన..

మట్టి టిప్పర్ రూ.7వేలు, ట్రాక్టర్ లోడు రూ.3 వేలకు పైమాటే. ఇలా రోజుకు సుమారు 50 ట్రిప్పులకు పైగానే తరలిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. తద్వారా రోజుకు లక్షల్లో ఆర్జిస్తున్నారని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు, పోలీసులను మ్యానేజ్ చేసుకుంటూ తన దందాకు ఇబ్బంది లేకుండా చేసుకుంటున్నారనే మాట వినిపిస్తోంది. మట్టి మాఫియా అక్రమాలపై ఇటీవల సాక్షి దినపత్రికలో వరుస కథనాలు రావడంతో మొన్నటి దాకా మట్టి తవ్వకాలు కాస్త నిలిపేశారు. తర్వాత డీల్ కుదిరిందేమోగాని మళ్లీ గతంలోకంటే మరింత ఎక్కువగా మట్టిని తోలేస్తున్నారు.

చెరువుల్లో తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం



చెరువుల్లో మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. వెంటనే దాడులు చేసి మట్టి రవాణాను ఆపాలని వీఆర్వోను ఆదేశించాను. వాహనాలను కూడా సీజ్ చేయాలని చెప్పా. ఎవరైనా అక్రమ వ్యాపారాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. ఇరిగేషన్, పోలీసు అధికారులకు సూచిస్తా. ఇక మీదట మండలంలో ఎక్కడా మట్టి, ఇసుక అక్రమ రవాణా జరక్కుండా చూస్తా.

– రేఖ, తహసీల్దార్, గంగవరం మండలం

అధికారం కోసం చంద్రబాబు మాయ మాటలు



కొండామర్రిలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చౌడేపల్లె: అధికారం కోసం చంద్రబాబు మాయ మాటలు చెప్పడం సర్వసాధరణమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.దామోదరరాజు, పార్టీ మండల కన్వీనర్ జి.నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ విమర్శించారు. వారు శనివారం వెంగళపల్లె, కొండామర్రి, గడ్డంవారిపల్లె గ్రామ పంచాయతీల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలతో పాటు మెనిఫెస్టోలో 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాన్ని కూడా ఊడగొట్టారని విమర్శించారు. కూటమి నేతల అక్రమాలు, అవినీతిని ప్రజలకు వివరించడమే బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరించాలన్నారు. అనంతరం క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరించారు. గ్రామకమిటీలు కీలకంగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, వెంకటరెడ్డి, సర్పంచులు నాగరత్న, జయసుధమ్మ, భాగ్యవతి, షంషీర్, ఎంపీటీసీలు లక్ష్మీనర్సయ్య, షాహీనా, శ్రీరాములు, పార్టీ మండల ఉపాధ్యక్షులు లడ్డూ రమణ, వెంకటరమణ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంగళపల్లెలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు

కోనేటిరాయా.. కల్యాణకట్ట ఏదీ స్వామీ!

గంగవరం: మండలంలోని కీలపట్లలో వెలసిన కోనేటిరాయస్వామి ఆలయంలో వెలసిన స్వామి, తిరుమలలోని స్వామివారు ఒకే పోలికతో ఉంటారు. ఈ క్రమంలో తిరుమల వెళ్లలేని భక్తులు ఇక్కడికి వచ్చి దర్శనం చేసుకుంటూ వుంటారు. ఈ ఆలయం టీటీడీ ఆధీనంలోకి చేరినప్పటి నుంచి నిత్య కైంకర్యాలు, ఏటా శ్రీవారి బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజూవారీ భక్తుల సంఖ్యలో పెరుగుతోంది. ఈ ఆలయానికి శ్రీవారి కల్యాణకట్ట లేకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తునానరు. భక్తులు ఆలయం వెనుక వైపున తలనీలాలు సమర్పిస్తున్నారు. తలనీలాల వల్ల ప్రైవేట్ వ్యక్తులు రోజుకు రూ.వేలకు వేలు సంపాదిస్తున్నారు. తద్వారా ఆలయానికి చెందాల్సిన ఆదాయం ఇతరులకు చేరుతోంది. టీటీడీ పాలక వర్గం స్పందించి ఆలయంలో శ్రీవారి కల్యాణ కట్ట ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర వివరణ ఇస్తూ దాతల సాయంతో ఆలయంలో కల్యాణ కట్ట నిర్మాణం చేపడతామన్నారు.



ఆలయం వెనుక వైపు తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

దారి సమస్య పరిష్కరించాలని ధర్నా

బైరెడ్డిపల్లె : ఎన్నో ఏళ్లుగా దారి సమస్యతో ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నాగిరెడ్డిపల్లె గ్రామస్తులు ఆరోపించారు. వారు శనివారం పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని మరవంక వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి బైరెడ్డిపల్లెకు మట్టి రోడ్డు ఉందన్నారు. వర్షాలకు గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేశారని తెలిపారు. మిట్టపల్లె గ్రామానికి చెందిన కొంత మంది రోడ్డుకు భూమి ఇవ్వకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి రోడ్డు నిర్మాణం కోసం భూమి పూజ చేసినా ఫలితం లేదన్నారు. ధర్నాతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న బైరెడ్డిపల్లె పోలీసులు, తహసీల్దార్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



పలమనేరు-కుప్పం జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న నాగిరెడ్డిపల్లె గ్రామస్తులు

త్వరితగతిన స్వామిత్వ సర్వే


బైరెడ్డిపల్లె : స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన శనివారం బైరెడ్డిపల్లె రైతు భరోసా సేవా కేంద్రంలో స్వామిత్వ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన సాంకేతికతతో గ్రామాల్లో భూములను సర్వే, మ్యాపింగ్ చేయడానికి ప్రభుత్వం స్వామిత్వ సర్వే చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్, నాగరాజు, వీఆర్వో భరణి, ఎంసీవో సురేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేంద్రబాలాజీ

కుప్పంలో 36 వేల మందికి అన్నదాత సుఖీభవ

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో 36,368 మంది రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు జమ అయినట్టు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఆయన శనివారం కుప్పంలో అన్నదాత సుఖీభవ మెగా చెక్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 36,368 మంది రైతులకు రూ.23.93 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



అన్నదాత సుఖీభవ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్సీ

తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించాలి



సదుం: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మల్లీశ్వరి



బైరెడ్డిపల్లెలో తల్లిపాల ప్రాముఖ్యతపై వివరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సదుం: ప్రతి ఒక్కరూ తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి తెలిపారు. మండలంలోని పొట్టింవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ జన్మించిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. తద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె-1 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వైద్య, ఆరోగ్య సిబ్బంది తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. స్టాఫ్ నర్సు లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు శ్రేయస్కరమని గర్భిణులకు వివరించారు.

నేటి నుంచి రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

పలమనేరు: రిజర్వేషన్ విధానంలో క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ ఆదివారం నుంచి కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించనున్నట్టు రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు అశోక్‌బాబు తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాత్రను ఆదివారం సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నుంచి ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఎస్సీ వర్గీకరణలో మాలలకు జరిగిన నష్టం, ఈ ప్రభుత్వంలో ఎస్సీలపై జరుగుతున్న దాడులపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు రాజ్యాంగ పరిరక్షణ యాత్రను చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం దాసరి చెన్నకేశవులు, చంద్రకుమార్, గోవిందు, రమణ తదితరులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు.



రాజ్యాంగ పరిరక్షణ యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కంటైనర్‌ను ఢీకొన్న కారు

పలమనేరు: పట్టణ సమీపంలోని చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలో మొగిలి ఘాట్‌లో శనివారం కంటైనర్‌ను కారు ఢీకొంది. కారు కొంత భాగం కంటైనర్ కిందికి వెళ్లి ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ పెద్ద గాయాలు కాలేదు. హైవేలో కొంతసేపు ట్రాఫిక్ ఆగిపోయింది. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణకు అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా డౌన్‌లో వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.



కంటైనర్ కిందికి దూసుకెళ్లిన కారు

చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు గోదావరి నీరు

- మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల

రొంపిచెర్ల: గోదావరి నుంచి కాలువల ద్వారా నీరు తీసుకువచ్చి చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని రైతులకు సాగు నీరు అందిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. రొంపిచెర్లలో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులకు సబంధించి మెగా చెక్కు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేశామని తెలిపారు. ఈ నెల 15న మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో రైతులకు సాగునీరు అందించేందుకు గోదావరి నుంచి కాలువల ద్వారా నీరు తీసుకుని వస్తామని చెప్పారు. గతంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి నీరు లేకుండానే కాలువలు తవ్వారని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో రూ.5000, పీఎం కిసాన్ కింద రూ.2000 వంతున 2,05,753 మంది రైతుల ఖాతాల్లో రూ.138 కోట్లు జమ చేశామని తెలిపారు. అలాగే రెండవ విడత అక్టోబరు, మూడవ విడత జనవరి నెలల్లో జమ చేస్తామని తెలిపారు. మామిడి రైతులకు రూ.135 కోట్ల సబ్సిడీ నిధులు వచ్చాయని తెలిపారు. వీటిని త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, తహసీల్దార్ అమరనాథ్, ఉద్యాన వన శాఖ అధికారి సంతోషికుమారి, ఏపీడీ శివకుమార్, ఏవో శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



అన్నదాత సుఖీభవ మెగా చెక్కు విడుదల చేస్తున్న మంత్రి, కలెక్టర్

వేడుకగా నాగాలమ్మ జాతర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం ఆటోనగర్‌లో వెలసిన నాగాలమ్మ ఆలయం వద్ద శనివారం నాగాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను వీధిలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసులకు గాయాలు

శాంతిపురం: బంధువుల పెళ్లికి ఆహ్వాన పత్రికలు ఇచ్చేందుకు వచ్చిన కోలారు జిల్లా పాముగానిపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. శాంతిపురం నుంచి కుప్పం వైపుకు ట్రాక్టర్ అకస్మాత్తుగా కుడి వైపుకు తిరగడంతో బైక్ ఢీకొంది. ఈ సంఘటనలో వివాహ పత్రికలు ఇచ్చేందుకు వెళ్తున్న పాముగానిపల్లికి చెందిన సోమశేఖర్‌రెడ్డి(60), పాపిరెడ్డి(52) తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108 ద్వారా కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నోటీస్ బోర్డు

- నేడు బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ

చౌడేపల్లె: మండలంలోని పందిళ్లపల్లె, ఆమినిగుంట, పరికిదొన పంచాయతీల్లో ఆదివారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి తెలిపారు. అలాగే గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

5న స్పాట్ అడ్మిషన్లు

కుప్పం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిన సీట్లలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కుప్పం డాక్టర్ వైసీ జేమ్స్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగన్నాథరావు తెలిపారు. ఆసక్తిగల వారు ప్రవేశ, ప్రాసెసింగ్ రుసుముతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నాలుగు సెట్ల జిరాక్సు కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డులతో 4వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కళాశాల పనివేళల్లో సంప్రదించాలని కోరారు. కళాశాలలోని మెకానికల్, ఎలక్ట్రానిక్ బ్రాంచులకు ఎన్‌బీఏ గుర్తింపును మరో మూడేళ్లు పొడిగించినట్లు తెలిపారు.

ఇంజినీరింగ్ కళాశాలలో...

కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు తెలిపారు. సివిల్, ఎంఈసీ, ఈసీఈ, ఈఈఈ, సీఎస్ఈ కోర్సుల్లో ఖాళీలు వున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు 10వ తరగతి సర్టిఫికెట్లు, 4 నుంచి 10 వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, కుల ధ్రువీకరణ పత్రాలతో రావాలని సూచించారు. వివరాలకు 9542423396 నంబరులో సంప్రదించాలని కోరారు.

కక్ష సాధింపులో భాగంగానే మిథున్‌రెడ్డి అరెస్టు



షేక్ అలీభాయ్

పులిచెర్ల(కల్లూరు) : రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అరెస్టు చేసిందని జిల్లా మైనారిటీ నాయకుడు, కేంద్ర ఉక్కు, గనుల వినియోగదారుల సలహా మండలి మాజీ సభ్యుడు షేక్ అలీభాయ్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ లిక్కర్‌కు ఎంపీకి ఏమి సంబంధమని ప్రశ్నించారు. నిజానిజాలు కోర్టులో తేలుతాయని, మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని తెలిపారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్



విజయ్‌కుమార్‌కు సత్కారం

వి.కోట: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన కొంగాటం విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్టానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఆయనను శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎంపీ నిధులతో బస్టాండ్‌కు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి

సదుం: స్థానిక బస్టాండ్ మరమ్మతులకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రూ.3 లక్షల నిధులు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ నిధులతో బస్టాండులో పెయింటింగ్ వేయించడంతోపాటు కుర్చీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే ఫ్యాన్లకు మరమ్మతులు చేయిస్తామని, వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఆయన శనివారం పనులను పరిశీంచారు.

ఇంటి నిర్మాణం చేపట్టకుంటే పట్టా రద్దు

పలమనేరు: పక్కా ఇల్లు మంజూరై ఇప్పటి వరకు నిర్మాణ పనులు చేపట్టని వారి ఇంటి పట్టాను రద్దు చేయాలని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. ఆయన శనివారం హౌసింగ్ అధికారులు, సిబ్బందితో ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వివిధ దశల్లో ఆగిన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.